క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మరికల్: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దచింకుంటలో జరిగింది. గ్రామానికి చెందిన అనురాధకు చెందిన ఆవు గ్రామ శివారులోని పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.లక్ష విలువ చేసే ఆవు మృతి చెందడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు ఆవులు మృతి చెందినట్లు తెలిపారు. లైన్‌మెన్ బాల్‌రాజ్ ఘటన స్థలానికి చేరుకొని పంచానామా చేసి ఏఈ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో బుధవారం వరల్డ్ కిడ్స్ అథ్లెటిక్ డే సందర్భంగా జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ రమణ మంగళవారం తెలిపారు. 4 నుంచి 7 సంవత్సరాల చిన్నారులకు సాక్ రిలే, లెమన్ అండ్ స్పూన్ రిలే, డ్రెస్ అప్ రిలే, ఫజిల్ రిలే వంటి క్రీడలు, 8 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు బ్రాడ్ జంప్ రిలే, స్ప్రింట్ రిలే, వాక్ రిలే తదితర క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమాచారం కోసం 90593 25183, 9063 500718ను సంప్రదించలన్నారు.

నేటి నుంచి శ్రీశైలానికి బస్సు సర్వీసు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం నుంచి శ్రీశైలానికి బుధవారం నుంచి ప్రత్యేక బస్ సరీ్వసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు నారాయణపేట నుంచి ఉదయం 5.40 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీశైలానికి చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి రాత్రి 8 గంటలకు డిపోకు వస్తుందన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం సరీ్వసు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీలక్స్ సరీ్వసు నడుపుతున్నందున మహిళలకు ఆధార్ కార్డు చెల్లదని, టికెట్ ధర రూ.470 చెల్లించాలని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రంలో భోజన వసతి



కోస్గి రూరల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ అధ్యక్షుడు తూం బీంరెడ్డి అన్నారు. మంగళవారం వివాహ వార్షికోత్సవం సందర్భంగా భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నంత వరకు రైతులకు భోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో శిక్షణ తరగతులు ప్రారంభం



దేవరకద్ర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ -14 ఖోఖో పోటీలు మంగళవారం కోయిల్‌సాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ పోటీలను జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 10 క్యాంపులు ఏర్పాటు చేయగా అందులో కోయిల్‌సాగర్ ఒకటని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల యువకులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని, ఖోఖోలో రాణించి రాష్ట్ర స్థాయికి, జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ కనకప్ప, మాజీ సర్పంచ్ వెంకటేశ్, గ్రామ నాయకులు చందుగౌడ్, మదన్, కథలయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా లబ్ధిదారుల ఎంపిక

- పకడ్బందీగా దరఖాస్తుల పరిశీలన
- మొదటి విడత మంజూరు 553 ఇళ్లు
- 26 జీపీల్లో 293 అర్హుల ఎంపిక



మండల కేంద్రంలో అర్హుల జాబితా పరిశీలనలో ఎంపీడీఓ సాయిలక్ష్మి

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అర్హులను గుర్తించేందుకు అధికారుల పకడ్బందీ చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని 30 జీపీల పరిధిలో 553 ఇళ్లు మంజూరు చేయగా.. ఇప్పటి వరకు 26 జీపీల్లో చేపట్టిన వెరిఫికేషన్‌లో 293 మందిని అధికారులు అర్హులుగా గుర్తించారు.దామరగిద్ద తదితర మూడు గ్రామాల్లో అధికారులు వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. గత్ప గ్రామం అన్ని పథకాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద



గత్పలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ఎంపిక చేసినందున గతంలోనే సర్వే పూర్తి చేశారు. సర్వే చేపడుతున్నగ్రామాల్లో మరింత మంది అనర్హులు తేలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నిబంధనల గుర్తింపు

ఇందిరమ్మ కమిటీల్లో ఇచ్చిన జాబితాలో కచ్చ ఇల్లు ఉండి, ప్రభుత్వ ఉద్యోగులు లేని, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఫోర్ వీలర్, ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్‌సీసీ ఇల్లు, గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఉన్నవారు,5 ఎకరాల కంటే ఎక్కువ మెట్టభూ మి ఉన్న, 2.5 ఎకరాల తరిభూ మి ఉన్నవారు అనర్హులుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభం

మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గత్ప గ్రామంలో ఇప్పటికే అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామంలో 72 మంది అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయగా 22 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. వీరిలో నిర్మాణ దశ ఆధారంగా బేస్‌మెంట్ లెవల్ బిల్లులు మంజూరు చేశారు. మిగిలిన వారు డిస్మెంటల్ చేసుకొని ఇల్లు నిర్మించుకుంటామని పనులు ప్రారంభించ లేదు.

నిబంధనల మేరకు అర్హుల గుర్తింపు



రాష్ట్ర ప్రభుత్వం ఇల్లులేని నిరుపేదలకోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రభుత్వం సూచించిన నిబంధనల మేర కు అర్హులను గుర్తిస్తున్నాం.మండలానికి మొదటి విడతలో 553 ఇందిర మ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇందిరమ్మ కమిటీ లు ఇచ్చిన జాబితాలో ఇప్పటి వరకు 222 మందిని అనర్హులుగా గుర్తించాం. మరో మూడు గ్రామాల్లో వెరిఫికేషన్ చేయాల్సి ఉంది.

– సాయిలక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద్ద

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న కిష్టారెడ్డి

మాగనూర్(మక్తల్): నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకుడు కిష్టారెడ్డి అన్నారు. మంగళవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగత్‌సింగ్ ఆవిష్కరణకు సహకరించిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్ లాంటి యువ కిశోరాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను గాలికొదిలేసి కాలయాపన చేస్తున్నాయని మండిపడ్డారు. మక్తల్ పట్టణంలో భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీం, కిరణ్, భగవంతు, భాస్కర్, శారద, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, రాజు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి

నారాయణపేట: కార్మికులకు నష్టం కల్గించే నాలుగు కార్మిక కోడ్‌లు తదితర డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మే 20న జరిగే జాతీయ సమ్మెలో నారాయణపేట మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న వాటర్ ఎలక్ట్రిసిటీ ఆఫీస్ స్టాఫ్, పారిశుద్ధ్య కార్మికులందరూ పాల్గొనున్నట్లు తెలిపారు. ఎండలు తీవ్రతరం అవుతున్న దృష్ట్యా ఒంటి పూట పనులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దయానంద్, నర్సింహులు, అనిల్, బుగ్గప్ప, పరశురాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మరికల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మె నోటీసు మండల పీహెచ్‌సీ వైద్యాధికారి రాఘవేందర్‌రెడ్డికి ఆశా కార్యకర్తలు అందజేశారు. ఆశా కార్యకర్తలు అందరూ సమ్మెల్లో పాల్గొని సమస్యలపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

మాగనూర్: మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనున్నట్లు ఆశా కార్యకర్తలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు అఫ్రోజ్ పాషాకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ అంజనేయులు మాట్లాడుతూ.. యజమానులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్న కేంద్ర ప్రభు త్వ విధానాలకు వ్యతిరేకంగా మే 20న సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పేట జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నారాయణపేట: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని గోడుగుగేరి అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మోసటి జ్యోతి, మాజీ వైస్ చైర్మన్లు కన్నాజగదీశ్, చెన్నారెడ్డి, విజయ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు వేపురి రాములు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు. మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి రాయచూర్‌లో రాజేందర్‌రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

మరికల్: బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, బసంత్ తదితరులు పాల్గొన్నారు.

‘రాష్ట్ర విలువను దిగజార్చడం సరికాదు’

కొత్తపల్లి: ముఖ్యమంత్రి రాష్ట్ర విలువను దిగజార్చి మాట్లాడటం సరికాదని బీఆర్‌ఎస్ మండల నాయకులు అన్నారు . మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించిందని మండిపడ్డారు. మండలంలోని లింగాల్‌చేడ్, పెద్దాపూర్, అల్లీపూర్, నందిగామ, భూనీడు, నిడ్జింత, దుప్పడి గట్టు, నందిగామ వాగుల నుంచి ఇసుక అక్రమరవాణా జరుగుతున్నా ఎలాంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు భూనీడు వెంకటేశ్, కిష్టప్ప, రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

రోడ్డు నిబంధనలపై అవగాహన



అమరచింత: గ్రామాల్లో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్లు, యాజమానులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ సురేష్ అన్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులను రహదారి భద్రతలపై అవగాహన కల్పించారు. అతి వేగంగా ట్రాక్టర్‌ను నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, ట్రాక్టర్‌కు సంబంధించిన అన్ని రకాల పత్రాలు ఉండాలని సూచించారు. జిల్లాలో రెండు రోజుల నుంచి ట్రాక్టర్ కిందపడి చిన్నారులు చనిపోతున్న ఘటనలు ఎక్కువవుతున్నాయని, వీటిని అరికట్టడంలో డ్రైవర్లు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నప్పుడు అతివేగంగా ట్రాక్టర్లను నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

అమరచింత: పంట మార్పిడితో రైతులు అధికంగా దిగుబడి పొందే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి అరవింద్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్ గ్రామంలో మంగళవారం ‘రైతు ముంగిట్లో వ్యవసాయ అధికారులు’ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా దేశం మొత్తంలో ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉన్నట్లే ప్రతి రైతుకు ఒక యూనిక్ ఐడీని కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. దీని కోసం రైతులు పాసు పుస్తకం, సెల్ నంబర్ తీసుకుని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు లేదా మీసేవా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని, పామాయిల్ సాగుతో లాభాలు ఉన్నాయన్నారు. విత్తన శుద్ధి, వానాకాలంలో వేసే పంట రకాల ఎంపిక, విత్తన రశీదు, నకిలీ విత్తనాల విషయంలో మోసపోకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరిత, రైతులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని పీయూ వైస్‌ఛాన్స్‌లర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర జయంతి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు కవిగా, విప్లవకారుడిగా లింగాయత్ మత వ్యవస్థాపకుడిగా సమాజంలో మార్పుకోసం కృషి చేశారని, కుల రహిత సమాజం, అసమానతలు లేని వ్యవస్థ కోసం ఆయన పాటుపడడం గొప్ప విషయమన్నారు. ముఖ్య వక్తగా హాజరైన బాదిమి శివకుమార్ మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగ అవలంభిస్తున్న రాజ్యాంగాన్ని బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే అవలంబించి, మార్గదర్శిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీ కళాశాల ప్రిన్సిపాల్ బీసీ సెల్ డైరెక్టర్ ప్రవీణ, ఎస్సీ, ఎస్టీ, సెల్ డైరెక్టర్ నాగం కుమారస్వామి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరం ప్రారంభం

మద్దూరు: జిల్లా అథ్లెటిక్స్, మద్దూరు వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక పాఠశాధ్వావరణలో ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా అథ్లెటిక్స్ ప్రధాన కార్యదర్శి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా వస్తులను అందజేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఉంటుందని నిర్వాహకులు భాస్కర్, ఫయాజ్ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ధన్వాడ: ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఒలంపిక్ సంఘ ఉపాధ్యక్షుడు రంగారావు అన్నారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ గాయింత్రి, కోచ్ రామ్మోహన్‌గౌడ్, హెచ్‌ఎం నరసింహచారి, అనంతసేన, రవికుమార్, కృష్ణంరాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రంగారావు

నర్వ: వేసవి సెలవుల్లో 15 రోజుల పాటు నిర్వహించే సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాథర్చేడ్ హెచ్‌ఎం కృష్ణ, పెద్దకడ్మూర్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నవీన్‌షా అన్నారు. మంగళవారం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. శిబిరంలో వలంటీర్ల అవసరమున్న నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు పాఠశాలల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాత్రికేయులు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా జర్నలిజం పనిచేస్తుందని, నిక్కచ్చిగా నిజాయతీగా వార్తలు రాయాలని కోరారు. జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే జిల్లాలో ఇద్దరు జర్నలిస్టులకు ఆర్థిక సాయం చెక్కును అందించామని, పెన్షన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులో జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు విషయంలో సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నారాయణరెడ్డి, ఆనంద్, శ్రీనివాస్, రఘు, రాజేష్ కుమార్, సురేష్, హనుమంతు, భగవంతు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి

ఘనంగా మైసమ్మ ఉత్సవాలు



నిడ్జింతలో మైసమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు



మద్దూరులో బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

మద్దూరు: మండల కేంద్రంలోని ఎండ్ల బజారులోని మైసమ్మ ఉత్సవాలు మంగళవారం మాజీ ఎంపీటీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోచమ్మ దేవాలయం నుంచి మేళతాళాల మధ్య జల్టి ఊరేగింపూ పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు సాగింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారుర. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. మహిళలు డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపూ నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ముష్టి నర్సిములు, తిరమలప్ప, మల్లప్ప, కృష్ణయ్య, చెన్నప్ప, ఆనంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిదిలోని నిడ్జింతలో కోట మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గంగపూజ కలశాల ఊరేగింపుతో జల్టి బిందే నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

నారాయణపేట: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది పాలనలో పేదల కోసమే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. నిరుపేదలను దృష్టిలో ఉంచుకునే రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి పట్టణంలో దాదాపు 500 మందికి ఇళ్ల మంజూరుకు కృషి చేశారన్నారు. అనంతరం వార్డు కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు మనోహర ప్రసాద్‌గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహ్మద్ సలీం

ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన మున్సిపల్ కార్మికులు

జడ్చర్ల టౌన్: పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దివ్యను మహబూబ్‌నగర్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి 2012–2014 సంవత్సరంలో పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జీతాల నుంచి కట్ అయినప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని, నష్టాలను ఆమెకు వివరించారు. దుర్వినియోగమైన డబ్బులను విషయంలో విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలని ఆమెను కోరారు. ఇప్పటి వరకు 7మంది కమిషనర్లు, ఇద్దరు ఈఓలు మారినప్పటికి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, 40కి పైగా కార్మికులు మృతి చెందినా, వారికి ఎలాంటి ప్రయోజనం దక్క లేదని వివరించారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణ చేసి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో యూనియన్ జడ్చర్ల అధ్యక్షుడు మహేష్, రాష్ట్ర నాయకులు రాజమల్లు, పాలడుగు సుధాకర్, కార్యవర్గ సభ్యురాలు శివలీల ఉన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీకి సమస్య విన్నవిస్తున్న వెంకటేశ్

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతి

అమరచింత: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే ప్రారంభించి, విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరచింత మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకులు మాత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయట్లేదని వాపోయారు. కళాశాల నిర్మాణం కోసం పట్టణంలో ప్రభుత్వ స్థలం కేటాయించి మూడేళ్లు గడిచినా.. అడుగు ముందుకు పడట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ చదివేందుకు ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, పాలమూర్ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఈ విద్యాసంవత్సరంలోనే జూనియర్ కళాశాల ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు.



మాట్లాడుతున్న కుతుబ్